# శ్రీ విద్య

నాగార్జున సాగర్‌లో లాల్ బహదూర్ కెనాల్‌వద్ద ఓ టూరిస్టు బస్సు ఆగింది. అందులోనుండి కొందరు (వ)వెన్నెల విసనకర్రలు దిగారు.

కొందరు మహారాష్ట్రం, మరికొందరు హిందీ మాట్లాడుతున్నారు- బస్సు ఆగడమే తరువాయి ఓ గైడ్ వాళ్ళను పట్టాడు. హిందీలోనూ,ఇంగ్లిషులోనూ ఉపన్యసించడం మొదలుపెట్టాడు. అతని వాగ్ధాటికి వారు ముగ్ధులయ్యారు. వెంటనే అతన్ని తమ వెంట ఉండడానికి నియమించుకున్నారు. ఇంకేం గైడ్ తన సహజ కవితాధోరణిలో టేప్‌రికార్డర్ మొదలుపెట్టాడు.

"ఇదే తెలుగువారి కలల పంట వలపుల జంటలాంటి లాల్ బహదూర్ కెనాల్, జవహర్ కెనాల్, ప్రాచీన దేవాలయం, నాగార్జున కొండ, నవీన దేవాలయం, నాగార్జునసాగరం, ఇందుండీ ప్రవహించే, ప్రసరించే గాలీ, నీరూ బౌద్ధుల త్రిశరణ కంకణ కింకిణీ రావాలతో, కలరావాలతో నినదిస్తున్నది రండి, గెస్ట్‌హౌస్‌వైపుకు వెళ్దాం".

ఈ భావాన్ని హిందీలోనూ, ఇంగ్లీషులోనూ కూడా చెప్పాడు అంతా బస్ ఎక్కారు. వాళ్ళతోపాటు గైడ్‌కూడా ఎక్కాడు. బస్సు గెస్ట్‌హౌస్‌వద్దకు పోయింది. అంతా భోజనాలకు ఉపక్రమించారు. మహారాష్ట్ర స్టయిల్‌లో చీరె కట్టిన వాళ్ళ లీడర్ అందరినీ పర్యవేక్షిస్తున్నది. ఆమె చాలా అందంగానూ, ఆకర్షణీయంగానూ వుంది. వయస్సు ఓ నలభై సంవత్సరాలు. ఇటు యవ్వన సూర్యుడు అస్తమించలేదు. అటు వార్ధక్య నిశీధి ఉదయించలేదు. రెండింటికీ మధ్య సంధ్యలో వుంది సన్నగా ఎర్రగా పొడుగ్గా సన్నజాజి పువ్వులా వుంది. చిన్న నోరు, చమత్కారమైన చూపులు, లిప్‌స్టిక్ లేకుండానే సహజారుణమైన పెదవులు, నవ్విస్తూ, కవ్విస్తూ లేడిలా గెంతుతూ పర్యవేక్షిస్తున్నది.

'మేడమ్, మీరు భోజనం చేయరా ?' ఒకామె అడిగింది లీడర్‌ను హిందీలోనే.

'మీరంతా కానివ్వండి. అన్నట్లు, గైడ్ - నీవూ భోంచేస్తావా' అన్నది మేడమ్.

'థాంక్స్, ఇప్పుడు తినను' అన్నాడు గైడ్.

'ఎప్పుడు తింటావు ?'

'మ్యూజియం వద్ద తింటాను'

'అక్కడ భోజనం దొరుకుతుందా ?'

'నా భోజనం నా సంచీలోనే వుంటుందండీ. నాలుగు రొట్టెలు కూరా ఓ ఉల్లిపాయ అంతే' నవ్వుతూ చెప్పాడు గైడ్.

మేడమ్ గైడ్ వైపు దయతో చూసింది.

భోజనాలు ముగిశాయి. మేడమ్ కూడా భోంచేసింది.

బస్సు బయలుదేరింది. సరిగ్గా లాంచీ బయలుదేరే వేళకు డామ్ కూడా చూచి మ్యూజియం కోసం కృష్ణాతీరం చేరారు.

ఆడవాళ్ళంతా నవ్వుతూ, తుళ్లుతూ, కేరింతలతో పడవ ఎక్కారు

కొందరు చప్పట్లు చరుస్తూ హిందీ పాటలు పాడుతున్నారు. కొందరు కబుర్లు చెప్పుకుంటున్నారు కొందరు ఆడవాళ్ళు హుషారుగా కేకలు వేస్తు న్నారు. గైడ్ మేడమ్‌ను అడిగాడు.

'తమరు....'

'బొంబాయి నుండి వచ్చాము. స్టాసీ సెంటర్ బృందం. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాలు టూర్ పెట్టుకున్నాము. సాగర్ మీదుగా అమరావతి, శ్రీశైలం వెళ్ళి హంపి, హాళేబీడు, బెంగుళూరు, మైసూరులు చూస్తాము" అన్నది మేడమ్ హిందీలో.

'నీకు రోజుకు ఎంత వస్తుంది ?'

'అది మీ దయను బట్టి ఆధారపడి వుంటుంది. రోజుకు ఒక బృందాన్ని త్రిప్పడానికి మాత్రమే టైం సరిపోతుంది" అన్నాడు గైడ్ వినయంగా.

పడవ కదిలింది.

మేడమ్ గైడ్‌ను దయతో చూడసాగింది.

ఆడపిల్లలకు బాగా హుషారెక్కింది. గయిడ్‌ను ఏడిపించడం మొదలు పెట్టారు.

'గైడ్‌గారూ... మీ పేరేమిటన్నారూ ?'

'అశోక్'

'అశోక్‌గారూ ! ఈ సుదీర్ఘమైన కృష్ణానదిని వర్ణించండి, మంచి కవిత్వంలో !'

ఒ బాబ్డ్ హెయిర్ సుందరి ఓ నవ్వు నవ్వి అశోక్‌ను రెచ్చగొట్టింది.

"అశోక పుష్యమిత్రశ్చ విక్రమ శ్శాలివాహనః" అన్నది ఇంకో పిల్ల వక్షస్థలం విరుచుకుంటూ.

అంతా ఘొల్లున నవ్వారు.

అశోక్ ఏమీ అనుకోలేదు. వేదాంతిలా నిర్లిప్తంగా ఓ చిరునవ్వు నవ్వి నిజంగానే వర్ణన మొదలు పెట్టాడు.

'ఏకాంతంలో స్నానం చేసి వచ్చిన అప్సరస పాద మంజీరాల ఘల ఘలలూ, కలకలారావాలు, కలరవాలు,నీళ్ళుగా మారితే ఈ కృష్ణానది అయింది. నిశ్శబ్దం సామ్రాజ్యం చేసేచోట కాశీరత్నం తీగె పూచినట్లూ, ఒంటరిగా అడవిలో ప్రవహించే సెలయేరు మధురగీతం విన్పించినట్లూ, ప్రత్యూషపవనాంకురాలకు కలువ కన్నె సిగ్గు తెరలను జార్చి దరహసిత వదనంతో కన్నుల రేకులు అల్లార్చినట్లు ఈ ప్రవాహం ప్రసారం చేస్తున్నదొక దివ్య భవ్య గాంధర్వాన్ని.'

అశోక్ వర్ణన విని ఆడపిల్లలంతా "హిప్ హిప్ హుర్రే" అని చప్పట్లు కొట్టి గెంతారు. "కాళిదాసు, కాళిదాసు" అన్నదొక చంచలాక్షి. 'భాసుడు'

శివభూతి" అన్నదొక మదిరాక్షి. 'షేక్స్పియర్ - షెల్లీ' అన్నదొక గుర్రపు జూలు జడ గల సుందరాంగి.

మేడమ్ కూడా ఈ వర్ణనతో పరవశించి పోయింది. అశోక్‌ను అలా రెప్ప ఆర్పకుండా చూడసాగింది. అశోక్ నాగార్జున సాగరాన్ని, ఆచార్య నాగార్జునుణ్ణీ, యజ్ఞశ్రీ శాతకర్ణినీ, అలా వర్ణించుకుంటూ పోతున్నాడు.

మేడమ్ పరవశంతో వింటున్నది.

'అగస్త్య' అనే ఆ పడవ మ్యూజియం దగ్గరికి చేరింది. అంతా నదిని దాటి మ్యూజియం దీవిలో ప్రవేశించారు. అక్కడినుండి అశోక్ తిరిగి తన ఉపన్యాసం మొదలు పెట్టాడు. శాతవాహనుల గూర్చిన చరిత్ర, సాహిత్యం, వేదాంతం, విజయ పరాజయాలు, రాజవంశ కథలూ, అన్నీ అక్షరాలలో అంకెలతో తేదీలతో సహా హిస్టరీ ప్రొఫెసర్‌లాగా అశోక్ చెప్పుకు పోతున్నాడు,

"ఇన్ని వివరాలు నీకెలా తెలుసు ? నీవేం చదువుకున్నావు ?"
మేడమ్ ప్రశ్నించింది.

"నేను పెద్ద చదువుకోలేదు మేడమ్. అయితే ఈ గయిడ్ ట్రైనింగ్ పొందాను. మాకు కొన్ని వ్యాసాలు మల్లంపల్లి సోమశేఖర శర్మ, మారేమండ రామారావుగార్లు వ్రాసినవి ఇస్తారు. వాటిని వప్పజెప్పుతాము. ఇవన్నీ చిలుక పలుకులు" అన్నాడు అశోక్ నవ్వుతూ.

అంతా మ్యూజియంలోకి ప్రవేశించారు. అశోక్ వాళ్ళకు అన్నీ వివరిస్తున్నాడు.

మేడమ్ ఒకచోటికి వచ్చి ఆగిపోయింది. అక్కడ ఒక శిల్పం వుంది. దానిమీద బ్రాహ్మీ లిపిలో ఏవో అక్షరాలు వున్నాయి.

'ఈ బొమ్మ చాలా బాగుంది. దీని కథ ఏమిటి ?' మేడమ్ అడిగింది.

'ఇది జయశ్రీ శాతకర్ణి కథ. అతడొక బౌద్ధభిక్షుకిని ప్రేమించాడు. ఆమె పేరు శ్రీవిద్య. ఆ చరిత్రే ఇందులో వుంది' అన్నాడు అశోక్.

'ఔనౌను. ఆ కథ లోగడ నేనెప్పుడో చరిత్రలో చదివినట్లు జ్ఞాపకం. వివరాలేమిటి చెప్పండి" అన్నది మేడమ్.

'సారీ మేడమ్ - నా కా కథ వివరాలు అంతగా తెలియవు' అన్నాడు అశోక్.

'అదేమిటి, గయిడ్ అన్నీ తెలుసుకోవాలి. సరే! నీకు తెలియకపోతే నేను చెపుతాను విను"

మేడమ్ ఆ కథను చెప్పింది. "విజయశ్రీ శాతకర్ణి మహాచైత్య విహారం లోని 'భదంతరాహులు'ని శిష్యురాలైన శ్రీ అనే బౌద్ధభిక్షుకిని ప్రేమించాడు. అయితే మఠాధిపతి ఈ పెళ్ళికి అంగీకరించలేదు. ఆ దిగులుతో విజయశ్రీ శాత కర్ణి గొప్ప చిత్రకారుడైనాడు. తన బాధను మరచిపోవడంకోసం ఆమెను రసరేఖలుగా చిత్రాలలో తీర్చిదిద్దాడు. ఆ మనోజ్ఞ కళాఖండాలతో అనాడు శాతవాహన సామ్రాజ్యం రసప్లావితమైంది. ఈ శ్రీవిద్య కథ నీకు తెలియక పోవడం ఆశ్చర్యంగా వుందే" మేడమ్ గైడ్‌ను అడిగింది. గయిడ్ ముఖం ఎందుకో తెల్లబోయింది. గయిడ్ మేడమ్ ఎదురుగా నిలబడ లేక వెళ్ళి పోయాడు.

అతడు అలా వెళ్ళిపోయేసరికి మేడమ్ బాధపడింది. తాను గయిడ్‌ను అవమానించినందుకు అట్లా వెళ్ళిపోయాడా? అతనికి చరిత్ర రాకపోవచ్చు. ఇత నేమి హిస్టరీ ప్రొఫెసర్ కాదుకదా, అంతా తెలియడానికి. తనైనా ఆసక్తికొద్దీ ఆ కథ తెలుసుకుందే కాని అందరికీ తెలియదుకదా!

ఈలోపల ఆడవాళ్ళంతా మ్యూజియంనుండి బయటపడి చైత్యాలు ఉన్న వైపుకు వెళ్ళారు.

మేడమ్ మాత్రం వాళ్ళతో వెళ్ళలేకపోయింది. గయిడ్‌కు శ్రీవిద్య కథ చెప్పినప్పటినుంచీ ఆమె మనస్సు అదోలా అయిపోయింది. ఒంటరిగా సున్నితంగా నడుచుకుంటూ మ్యూజియం అవల వున్న కృష్ణా తీరంలో స్నానాల రేవువద్దకు పోయింది. అక్కడ సోపానపంక్తి వుంది. మేడమ్ అక్కడికి పోయేసరికి ఆశ్చర్యం! అశోక్ అక్కడ కూర్చొని వున్నాడు. వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

మేడమ్ నివ్వెరపోయింది. ఆమెకేమీ పాలుపోలేదు. నవ్వుతూ నవ్విస్తూ చరిత్ర, సాహిత్యం, కవిత్వం, వేదాంతం,ఉపన్యసించే ఈ గయిడుకు కన్నీళ్ళా??

మేడమ్ అతనిదగ్గరికివెళ్ళి కూర్చున్నది.

"అశోక్ - మిస్టర్ అశోక్" సున్నితంగా పిలిచింది.

అశోక్ ఉలిక్కి పడ్డాడు. మేడమ్‌ను చూశాడు కన్నీళ్ళు తుడుచుకొని సిగ్గుపడ్డట్లు తల వంచుకున్నాడు.

"ఎందుకు నీవు ఏడుస్తున్నావు? నేను నిన్ను ఇన్సల్టుచేశానా?"

"లేదండీ. నేనే ఏదో గుర్తువచ్చి ఏడ్చాను."

"అదేమిటో నేను వినవచ్చునా?" మేడమ్ మృదువుగా అడిగింది.

అశోక్ కొంచెంసేపు ఆలోచనలలో పడ్డాడు, తర్వాత ఇలా అన్నాడు. "సరే! వినండి. ఇందాక మీరు నాకు చెప్పారే శ్రీవిద్య కథ, అది నాకు తెలుసు. నిజం చెప్పాలంటే ఆ కథవల్లనే నేను ఆకర్షింపబడి ఈ గయిడుపని చేస్తూ ఇక్కడ జీవిస్తున్నాను. అయితే వచ్చిన టూరిస్టులందరికీ ఆ కథను వివరించి చెప్పడం నాకిష్టంవుండదు. టూరిస్టులు కూడా ఆ కథను అడగరు. ఇవ్వాళ మీరు తొలిసారిగా ఆ కథను నాకే చెప్పారు. అందుకని దుఃఖం వచ్చింది. మీరు హిస్టరీ స్టూడెంటా?"

"కాదులే, నాకా కథ అంటే ఇష్టం. ఇంతకూ నీకా కథ అంటే ఎందుకంత ఇష్టం? ఎందుకు నీకా కథ తెలిసికూడా ఇతరులకు చెప్పడంలేదు? నేనా కథ చెపితే నీవెందుకు ఏడ్చావు?" మేడమ్ అడిగింది.

అశోక్ కళ్ళు కృష్ణానదీ తరంగాలవలె మారాయి. కొంచెం ఆగి మెల్లగా మొదలుపెట్టాడు.

"వినండి మేడమ్. నేను చిన్నప్పుడొక అమ్మాయిని ప్రేమించాను. ఆమె పేరు శ్రీవిద్య. ఆమె మా పక్కింటి పిల్ల - 'శ్రీవిద్యా! ఆడుకుందాం వస్తావా' అని పిలిచాను ఒకనాడు.

'నాకు రాదు' అన్నది సిగ్గుతో.

'నేర్పుతాను రా' అన్నాను.

ఇలా ప్రారంభమైంది ప్రణయం. ఆమె నడిచినా, పలికినా కదిలినా, చూసినా పరవశించిపోతూ ఉండేవాడిని. నేను పెద్ద ధనవంతుణ్ణికాదు, వాళ్ళ నాన్న ఆ పిల్లను ధనవంతునికిచ్చి పెళ్ళిచేసాడు. నేను బ్రతిమలాడుకున్నాను. నామాట వినలేదు. దానితో నాకు జీవితంమీద విరక్తి ఏర్పడింది. ఆత్మహత్య చేసుకోలేకపోయాను. బికారిగా వూరూరు పట్టుకొని తిరిగాను, ఆమెను చూడాలని ఒకసారి వాళ్ళింటికే వెళ్ళాను అదొక పెద్ద అంతఃపురం. నేనెలా ప్రవేశించగలను? ఏడుస్తూ తిరిగి వెళ్ళిపోయాను. ఇదీ కథ మేడం. శ్రీవిద్య ఆ తర్వాత ఆమెతోసహా పారిన్ వెళ్ళాడని కొందరూ-మరేదో మహానగరంలో ఆఫీసర్‌గా ఉన్నాడని కొందరూ అన్నారు. వివరాలేమీ తెలియలేదు.

నాలోని బాధను మరచిపోవడంకోసం ఈ గయిడు వృత్తి స్వీకరించాను. శాతవాహనుల కథలు ఇలా యాత్రికులకు చెబుతూ ఉపన్యసిస్తూ కవిత్వంలో, చరిత్రలో, వేదాంతంలో పరవశిస్తూ, పులకరిస్తూ జీవితం గడుపుతూ వున్నాను. ఉపన్యసించే గయిడ్సులో నేను చాలా గొప్పవాడినని పేరుపొందాను. కాని మేడం! నా మనస్సులోని బాధ ఎవరికి తెలుసు? అందరూ చప్పట్లు కొడుతుంటారు. నా మాటలు విని పరవశిస్తూవుంటారు. కాని వారికి నా బాధామయ గాధ తెలియదు. నాకా విజయశ్రీ శాతకర్ణి వేయించిన శిల్పమూ, దానిమీద వున్న 'శ్రీవిద్య' అనే బ్రహ్మీలిపి అక్షరాలూ ఇష్టం. అందుకని నేనీ మ్యూజియంకు అంటిపెట్టుకొని వున్నాను."

మేడం కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి

"క్షమించు అశోక్. నాకీసంగతి తెలియక నీకా కథ చెప్పి బాధ కల్గించాను. మనస్సును తేలికచేసుకో. మరీ అంత సెంటిమెంటల్‌గా వుండకు.

జీవితమంటే ఒ నాలుగు క్షణాలు. ఓ రెండు క్షణాలు గడిచిపోయాయి. ఇంకో రెండు క్షణాలేగా! శ్రీవిద్య అంతర్యపు లోతుల్లో నీవెప్పుడో ఆటోగ్రాఫ్ వ్రాశావు. శారీరకంగా దగ్గరగావుండి, మానసికంగా సుదూర తీరాలలో బ్రతికే

బ్రతుకుకన్నా దూరంగా వుండి ఇలా దగ్గరకావడమే మంచిది. శరీరంకన్నా స్మృతి చాలా గొప్పది, బలమైనది, శాశ్వతమైనది" అన్నది మేడం తెలుగులో.

"అయితే ఆమె నాకిప్పుడు దక్కలేదన్న దిగులులేదు ఎందుకంటే నాకు కావలసింది ఆమె సుఖం. ఆమె ధనాలలో సుఖిస్తున్నప్పుడు స్వార్థంతో నాకు కావాలని ఎందుకు కోరుకోవాలి నేను?"

"అశోక్! నీ చేతి నాకసారి ఇలా ఇవ్వు" అన్నది కరుణతో. మేడం మాట లకు నివ్వెరపోయి అశోక్ తన చేతిని ఆమెకిచ్చాడు.

ఆమె అశోక్ చేతి వ్రేళ్ళను సున్నితంగా తాకి వదిలివేసింది.

"నీలా ఆలోచించేవాళ్ళు చాలా అరుదుగా వుంటారు. కన్నీళ్ళు తుడుచుకొని ఇంకవెళ్ళు. రేపటినుండి విజయశ్రీ శాతకర్ణి ప్రణయ వృత్తాంతం వచ్చిన ప్రతి యాత్రికునికీ చెప్పు. దాచిపెట్టవద్దు - అందులోనే పరవశం చెందుతూ జీవించు."

అశోక్ కళ్ళల్లో ఏదో కొత్త మెరుపు.

బిలబిలమంటూ ఆడపిల్లలంతా స్నానాలరేవుకు వచ్చారు.

"ఓహో గయిడు మహాశయా! ఏమిటి మా శ్రీవిద్యగారికి శాతవాహనుల వైభవంగూర్చి ఉపన్యాసాలు దంచుతున్నారా ఏకాంతంగా."

అశోక్ కళ్ళు పెదవులూ వణికాయి. మనిషి నిలువెల్లా కంపించి పోయాడు. "శ్రీ-వి-ద్య" అని పెదవులు అవ్యక్తంగా కదిలాయి.

ఆడపిల్లలలో ఒకామె గయిడుకు డబ్బులిచ్చింది.

అంతా గయిడుకువీడ్కోలు చెప్పారు.

శ్రీవిద్య గయిడును చూచి విచిత్రంగా నవ్వింది.

"మీరు - మీరు - నీవు - శ్రీవిద్యవా?" అన్నాడు అశోక్.

"ఔను నేనే నీవారాధించే శ్రీవిద్యను. ఎన్నో ఏళ్లు గడిచిపోయాయికదూ. అందుకని పోల్చుకోలేకపోయావు. నిజం చెప్పాలంటే నీకున్న మనశ్శాంతి నాకు లేదు. కారణం నీచుట్టూ నీవొక ప్రపంచాన్ని నిర్మించుకున్నావు. అందులో నీవు సుఖంగా బ్రతుకగలవు. ఈ నాగార్జున సాగరం, ఈ కృష్ణానదీ ఈ మ్యూజియం, ఈ విజయశ్రీ శాతకర్ణి శిల్పమూ...." శ్రీవిద్య తన బృందంతో సాగిపోయింది.